సాక్షి వికారాబాద్

ఆదివారం । 19 । జనవరి । 2025



వాహనదారులకు శాపం

జాతీయ రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



వాహనాలు నడపొద్దు

వాహనచోదకులు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. 8లో▸



పగలే వెలుగులు!

దుద్యాల్ మండలం హస్నాబాద్ గ్రామంలో రాత్రి పగలు అనే తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. 9లో▸

అన్నదాత.. అడ్డాకూలీగా!

నాడు కర్షకుడు.. నేడు కార్మికుడు

దేశానికి అన్నం పెట్టే రైతుకు కష్టకాలం వచ్చింది. భూ మాతను నమ్ముకొని వ్యవసాయమే వృత్తిగా పంటలు పండించే అన్నదాతను ప్రతికూల వాతావరణం కష్టాల్లోకి నెట్టేస్తోంది. దిగుబడి రాక అప్పులపాలై ఉపాధి కోసం అడ్డా కూలీగా మారుతున్నాడు.

- భూములు అమ్మిన రైతుల పరిస్థితి దయనీయం
- యాంత్రీకరణతో దెబ్బతిన్న ఉపాధి
- పంటల సీజన్‌లోనూ దొరకని పనులు
- పట్టణాలకు వలస బాట
- జిల్లాలో 45,178 మంది రిజిస్టర్డ్ లేబర్స్
- తాండూరులో అత్యధిక మంది కార్మికులు



పని కోసం వచ్చిన రైతులు



తాండూరులో అడ్డామీద కూర్చుని పని కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు

బషీరాబాద్: ఆరుగాలం శ్రమిస్తూ.. నిత్యం పొలం పనుల్లో మునిగితేలే అన్నదాత పుట్టెడు అప్పుల్లో చిక్కుకుంటున్నాడు. పచ్చటి పంట పొలాలను అమ్మేసుకుంటున్నాడు. గతంలో ఎంతో మందికి వ్యవసాయ పనులు కల్పించిన కర్షకుడు నేడు తానే ఉపాధి కోసం అష్టకష్టాలు పడుతున్నాడు. మరోవైపు యాంత్రీకరణ వ్యవసాయంతో వ్యవసాయ సీజన్‌లో సైతం పొలం పనులు దొరక్క పల్లెలు విడిచి పట్టణాలు, నగరాలకు పొట్ట చేతబట్టి వలసబోతున్నాడు. భవన నిర్మాణ పనుల్లో అడ్డా కూలీగా మారాడు. ఉపాధి కల్పించే స్థాయి నుంచి పనుల కోసం వెతుకులాడుతున్న కర్షకుల దయనీయ దుస్థితిపై 'సాక్షి' ప్రత్యేక కథనం. జిల్లాలో ప్రధాన వనరు వ్యవసాయం. ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు ఇప్పుడు రోజువారి కూలీలుగా మారుతున్నారు. సాగు చేసి నష్టాలు మూటగట్టుకొని కూలి పనుల కోసం హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పట్టణాలకు వేల మంది వెళ్తున్నారు. ఇందులో 90శాతం మంది రైతులు, రైతు కూలీలే ఉంటున్నారు. జిల్లాలోని వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. 600ల అడుగుల వరకు బోర్లు వేసినా చుక్కనీరు పడటం లేదు. దీంతో 40 శాతం మేర వ్యవసాయ భూములు రియల్టర్ల చేతుల్లోకి వెళ్లిపోయాయి. కొన్ని భూములకు రియల్టర్లు కంచెలు వేసుకొని బీడుగా వదిలేశారు.

45,178 మంది భవన నిర్మాణ కార్మికులు

చాలా మంది రైతులకు భూమి ఉన్నా నీటి వసతి లేదు. వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తే దిగుబడి.. గిట్టుబాటు ధర లభించడం లేదు.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చేందుకు రోజువారీ కూలీలుగా మారుతున్నారు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 45,178 మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. పాలిషింగ్ యూనిట్లలో మరో 10వేల మంది పనిచేస్తున్నారు. తాండూరులో ఎక్కువగా ఉపాధి పనులు దొరుకుతుండటంతో నియోజకవర్గం నుంచే కాకుండా వికారాబాద్, కొడంగల్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, జార్ఖండ్ ప్రాంతాల నుంచి వేల మంది కార్మికులు వచ్చి పనులు చేసుకుంటున్నారు.

వికారాబాద్ డివిజన్‌లోకి వచ్చే మండలాలు

వికారాబాద్, పరిగి, మోమిన్‌పేట్, నవాబుపేట్, మర్పల్లి, కుల్కచర్ల, దోమ, పూడూరు, చౌడాపూర్

కార్మికుల సంఖ్య: 18,892


తాండూరు డివిజన్‌లోకి వచ్చే మండలాలు

తాండూరు, బషీరాబాద్, దౌల్తాబాద్, యాలాల, ధారూరు, బంట్వారం, కోట్‌పల్లి, పెద్దేముల్, కొడంగల్, దుద్యాల్

కార్మికుల సంఖ్య: 24,707

2009 - 2024 మధ్య జిల్లాలో కార్మికుల సంఖ్య

సంవత్సరం	లేబర్ రిజిస్ట్రేషన్లు
2009	3,006
2010	551
2011	318
2012	4,284
2013	1,682
2014	2,047
2015	2,429
2016	1,411
2017	2,518
2018	3,163
2019	2,779
2020	5,545
2021	5,332
2022	4,048
2023	2,612
2024	3,453



ఇంటి నిర్మాణ పనుల్లో..

పై చిత్రంలో కనిపిస్తున్న ఇద్దరు కార్మికులు భార్యభర్తలు. బషీరాబాద్ మండలం బోజ్యానాయక్‌తండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్ ఓ చిన్నకారు రైతు. తనకున్న మూడెకరాల పొలంలో పంటలు సాగు చేసేవాడు. గ్రామంలోని పది మందికి ఉపాధి కల్పించేవాడు. అయితే కాలం కలసిరాకపోవడం.. వేసిన రెండు బోర్లలో చుక్క నీరు పడక అప్పుల పాలయ్యాడు. దీంతో వానాకాలంలో పంటలు సాగు చేస్తూ మిగతా కాలంలో భార్య రేణుక, నలుగురు పిల్లలతో కలిసి తాండూరులో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. వీరికి ప్రభుత్వం కార్మికులుగా గుర్తింపు కార్డులు కూడా జారీ చేసింది.

వ్యవసాయ పనులులేక..



నా పేరున తండాలో 3 ఎకరాల పొలం ఉంది. కంది పంట వేశా. ప్రస్తుతం పనులు లేవు. పంట కోతకు మిషన్లు వాడుతున్నారు. దీంతో రెండేళ్ల నుంచి తాండూరులో అడ్డా మీద పనికోసం వెళ్తున్నా. రోజుకు రూ.700 ఇస్తున్నారు. వారంలో మూడు, నాలుగు రోజులే పని దొరుకుతోంది. మిగతా రోజుల్లో ఒట్టి చేతులతో ఇంటికి వెళుతున్నా.

– సేవ్యానాయక్, కార్మికుడు(రైతు) బోజ్యానాయక్ తండా

కుటుంబ పోషణ కోసం



మర్పల్లి మండలం పంచలింగాల గ్రామం నాది. 30 గుంటల వ్యవసాయ భూమి ఉంది. పంట డబ్బు కుటుంబ పోషణకు సరిపోవడం లేదు. బిడ్డ పెళ్లి కోసం అప్పు చేశా.. తీర్చడానికి తాండూరు వచ్చి మేస్త్రీ పని కోసం అడ్డ మీదకు వెళ్తున్నా..పని దొరికితే రోజుకు రూ. 1,000 ఇస్తారు. పని లేకుంటే తాండూరు రైల్వేస్టేషన్‌లో పడుకొని తెల్లారితే పని వెతుక్కుంటున్నా.

– మచ్చేందర్, రైతు,(తాపీ మేస్త్రీ) పంచలింగాల, మర్పల్లి మండలం

సేడం నుంచి వస్తున్నాం



మాది గుల్బర్గా జిల్లా సెడం తాలూకా. నేను, నా భర్త పనుల కోసం రోజూ రైల్లో తాండూరుకు వస్తున్నాం. మాకు ఊరిలో వ్యవసాయ భూమి ఉండేది. అమ్ముకోవడంతో కూలీలుగా చేస్తున్నాం. మిషన్లు వచ్చిన నాటి నుంచి వ్యవసాయ పనులకు పిలవడం లేదు. నాలుగేళ్లుగా తాండూరులో అడ్డ మీదకు కూలీ కోసం వస్తున్నాం.

– ఈరమ్మ, సేడం, కర్ణాటక

కార్మికులుగా చేరుతున్నారు

జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గ్రామాల్లో భూములు ఉన్న రైతులు కూడా లేబర్ పనికోసం పట్టణాలు, నగరాలకు వలస వెళ్తున్నారు. ఇప్పటికే చాలా మంది కర్షకులు కార్మిక శాఖలో సభ్యత్వం తీసుకున్నారు. భవన నిర్మాణంలో కూలీలుగా, తాపీ మేస్త్రీ పనులు చేస్తున్నారు. పంటలు సరిగ్గా పండకపోవడం, నష్టాలు రావడం, అప్పులపాలు కావడంతో కూలి పనులకు వస్తున్నట్లు తెలిసింది. రెగ్యులర్‌గా పనిచేసే వారికి గుర్తించి కార్మిక శాఖ తరఫున ఐడీ కార్డు జారీ చేస్తున్నాం.

– వాల్యానాయక్, జిల్లా కార్మికశాఖ అధికారి

న్యూస్‌రీల్

పారిశ్రామికవాడకు మహిళా రైతు ఓకే

- భూమి ఇచ్చేందుకు సుముఖత
- తహసీల్దార్‌కు అంగీకార పత్రం అందజేత



తహసీల్దార్‌కు అంగీకార పత్రం ఇస్తున్న మహిళా రైతు అంజిలమ్మ

దుద్యాల్: మండలంలోని లగచర్ల గ్రామానికి చెందిన ఈర్లపల్లి అంజిలమ్మ అనే మహిళా రైతు పారిశ్రామిక వాడకు భూమి ఇవ్వడానికి ముందుకు వచ్చింది. అందుకు సంబంధించిన అంగీకార పత్రాన్ని శనివారం తహసీల్దార్ కిషన్‌కు అందజేశింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. లగచర్ల గ్రామ సర్వే నంబర్ 102లో తనకు 22 గుంటలు భూమి ఉందని తెలిపారు. పారిశ్రామిక వాడ ఏర్పాటులో నా భూమి కూడా పోతుందని అధికారులు తెలిపారని.. దీంతో తానే స్వయంగా తహసీల్దార్‌ను కలిసి భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపి అంగీకార పత్రం అందింజేశినట్లు వివరించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్య దర్శి వెంకటయ్య, మాజీ సర్పంచ్ ఖాజా, గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్ తదితరులు ఉన్నారు.

'ఓరియంటేషన్'ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే ఓరియంటేషన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని కోర్టు ఆవరణలో శనివారం జిల్లాలోని పారా లీగల్ వలంటీర్లు, న్యాయ విద్యార్థులు, న్యాయసేవా ప్యానల్ న్యాయవాదులకు రెండు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో పిల్లలపైన జరుగుతున్న అఘాయిత్యాలు వాటి నివారణకు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్, జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, లీగల్ ఎడ్ న్యాయవాదులు వెంకటేష్, రాము, శ్రీనివాస్, న్యాయవాదులు బాలయ్య, నాగరాజు, నర్సింలు, యాదగిరి, పారలీగల్ వలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే

మాజీ మంత్రి మహమూద్ అలీ

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ నేతలు చర్చకు రావాలని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ సవాల్ విసిరారు. జేపీదర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఆయన శనివారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దర్గా అభివృద్ధి కోసం అప్పట్లో సీఎం కేసీఆర్ రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. మాస్టర్‌ప్లాన్ అమలుతో స్థానికులు, వ్యాపారులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలనే ఆలోచనతో పనులు చేపట్టడానికి కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. ఈ విషయాలు తెలియని కాంగ్రెస్ నేతలు దర్గా అభివృద్ధిని బీఆర్‌ఎస్ నాయకులు పట్టించుకోలేదని ఆరోపించడం సరికాదన్నారు. 60 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఎందుకు అభివృద్ధి పనులు చేపట్టడం లేదని నిలదీశారు. బీఆర్‌ఎస్ హయాంలో దర్గా అభివృద్ధి కోసం కేటాయించిన రూ.50 కోట్ల నిధులు ఇప్పటికీ మైనార్టీ కార్పొరేషన్‌లోనే ఉన్నాయని స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావులపై కాంగ్రెస్ పార్టీ కుట్ర పూరితంగా పెడుతున్న కేసుల నుంచి వారికి న్యాయం జరగాలని ప్రార్థనలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ నస్రుల్లాఖాన్, రాంబాల్‌నాయక్, మిట్టునాయక్, సత్యనారాయణ, దేవేందర్‌యాదవ్, యాదగిరి, కె.శ్రీనివాస్ గౌడ్, గోపాల్‌నాయక్, అజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యూచర్' రహదారిపై రైతులతో సమావేశం



కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న మండల పరిధిలోని తిమ్మాపూర్ రైతులతో శనివారం రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జీవీ రాజు, తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో రైతులతో పరిహారం విషయమై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ కోసం వంద మీటర్ల రహదారి నిర్మాణానికి తమ భూములు ఇవ్వాలని, భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఉంటుందని తెలిపారు. తమ భూములకు బహిరంగ మార్కెట్‌లో రూ.4 కోట్లు ధర పలుకుతోందని, ఆ ప్రకారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు వారికి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ యాదగిరి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాల పోస్టర్ల ఆవిష్కరణ

ఆమనగల్లు: వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి ఉచిత శిక్షణ శిబిరాల పోస్టర్లను త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆవిష్కరించారు. ముచ్చింతల క్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వీటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు దార్ల చిత్తరంజన్‌దాస్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జిలు శ్రీరాం, జంగయ్య, రాజేశ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

వీఎం హోం నిర్వాహకులపై ఫిర్యాదు

హుడాకాంప్లెక్స్: పాఠశాల పని దినాల్లో సినిమా షూటింగ్‌లకు అనుమతి ఇచ్చి విద్యార్థుల హక్కులకు భంగం కలిగించిన వీఎంహోం కార్యదర్శి కె.కిషన్, సూపరింటెండెంట్ ఈ.లక్ష్మీపార్వతి, ప్రిన్సిపాల్ భాస్కర్‌ను సస్పెండ్ చేయాలని వీఎంహోం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బి.మహేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. అక్రమ సంపాదన కోసం విద్యార్థుల చదువులను పణంగా పెట్టడం, బాలల హక్కులకు భంగం కలిగించిన విషయంపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్, బాలల హక్కుల కమిషన్‌తో పాటు షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా శనివారం ఫిర్యాదు చేశారు. వీఎంహోంలో సిబ్బంది నియామకం, కొనుగోలు టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సహాయ కార్యదర్శి సాగర్, ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు భాస్కర్, వినయ్, విఠల్, గణేష్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



పోలేపల్లి రైతులతో చర్చలు జరుపుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పారిశ్రామికవాడ రైతులతో చర్చలు

- కలెక్టర్ అధ్యక్షతన సమావేశం

అనంతగిరి: మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం అసైన్డ్ భూములకు సంబంధించి దుద్యాల్ మండలం పోలేపల్లి రైతులతో శనివారం కలెక్టర్ ప్రతీక్ జైన్ చర్చలు జరిపారు. గత ఏడాది నవంబర్ 29న జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో 34 మంది రైతులు పాల్గొన్నారు. గ్రామంలోని 73.39 ఎకరాల భూమికి సంబంధించి రైతుల నుంచి సమ్మతి పొందినట్లు తెలిపారు. ఎకరాకు రూ.20 లక్షల పరిహారం, 150 గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు, ఇంటికో ఉద్యోగం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, టీజీఐసీ జోనల్ మేనేజర్ శైలజ, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ అజీమ సుల్తానా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, దుద్యాల్ తహసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.

నివేదికలు రూపొందించాలి

అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పై పథకాల అమలుకు సంబంధించి ఆదివారం మధ్యాహ్నంలోపు నివేదికలు రూపొందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డీపీఓ జయసుధ, డీసీఎస్‌ఓ మోహన్‌బాబు, వ్యవసాయ శాఖ ఏడీఏ స్వరూప రాణి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

ఇబ్రహీంపట్నం: సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలు ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభల్లో మూడేళ్లలో ప్రజా సమస్యలపై పార్టీ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను బేరీజు వేసుకుంటూ, భవిష్యత్తులో చేపట్టాల్సిన ఉద్యమాలకు రూపకల్పన చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బుగ్గరాములు, చింతపట్ల ఎల్లేష్, ముసలయ్య, చెనమోని శంకర్, విజయ్, ప్రభుదాసు, యాదగిరి, వీరేష్, రాఘవేందర్, రజాక్ పాష పాల్గొన్నారు.

రూ.120 కోట్లతో కోట్‌పల్లి ఆధునీకరణ

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం



ధారూరు: కుక్కింద గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు కోట్‌పల్లి ఆధునీకరణకు రూ.120 కోట్లు మంజూరు చేయించినట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రాజెక్టులో గంపెడు మన్ను కూడా తీయలేదని ఆరోపించారు. ప్రస్తుత నిధులతో ప్రాజెక్టు, కాలువలను ఆధునీకరించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుక్కింద, ఏఎంసీ మార్కెట్, స్టేషన్‌ధారూరు, దోర్నాల్, నాగారం, తరిగోపుల గ్రామాల్లో సీసీ రోడ్లు, నాగారంలో పల్లె దవాఖానాను ప్రారంభించారు. ధారూరు స్త్రీశక్తి భవన్‌లో 36 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు అందేలా చూస్తామన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధారూరు ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు విజయభాస్కర్‌రెడ్డి, అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి మల్లేశం, తహసీల్దార్ సాజిదాబేగం, పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్, డీఈ శ్రీనివాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాములు, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బసప్ప పాల్గొన్నారు.

దైవభక్తి అలవర్చుకోవాలి

మర్పల్లి: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని బూచన్‌పల్లిలో గ్రామ దేవతల బోనాల ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గూడెం రాములు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి

అనంతగిరి: రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అందరూ సహకరించాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులతో శనివారం తన క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి ఎలాంటి నష్టం జరగకుండా పరిహారం అందేలా చూస్తామన్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా బ్రిడ్జి నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. నిర్వాసితుల త్యాగం వెల కట్టలేమని, మీ బాధను అర్థం చేసుకుని అన్ని విధాలా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొలంలో భగీరథ గేట్‌వాల్



గేట్‌వాల్‌ను చూపిస్తున్న రైతు

బొంరాస్‌పేట: మిషన్ భగీరథ పైపులైన్ తన పొలం గుండా వేయడంతో సాగు సమయంలో తీవ్ర అవస్థలు పడుతున్నానని మండల పరిధిలోని రేగడిమైలారం శివారులో ఓ రైతు ఆవేదన చెందుతున్నాడు. స్థానికంగా ఉన్న జాతీయ రహదారి163కి ఆనుకొని కడంపల్లి బాలయ్యకు సుమారు రెండు ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో నుంచి బాపన్ చెర్వుతం డాకు మిషన్‌భగీరథ పైప్‌లైన్ వేశారు. సరిగ్గా తన పొలంలోనే గేటువాల్ దిమ్మె ఉండటంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడి పంట సాగు చేసుకోలేక పోతున్నానని వాపోతున్నాడు. అధికారులు ఇప్పటికైనా గేటువాల్‌ను తొలగించాలని కోరుతున్నాడు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



నవాబుపేట: కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన శనివారం నారెగూడ గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నారెగూడ గ్రామానికి చెందిన గొల్ల రవీందర్‌కు 100 గొర్రెలు ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో శుక్రవారం రాత్రి వాటిని ఉంచాడు. శనివారం ఉదయం పెద్ద గొర్రెలను మేపడానికి తీసుకుపోయారు. గొర్రె పిల్లలను అక్కడే ఉంచి వాటికి చుట్టూ కంచె ఏర్పాటు చేసి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో కుక్కలు కంచెను చిందరవందర చేసి 20 గొర్రె పిల్లలను కరిచి చంపేస్తుండగా ఓ రైతు గమనించి తరిమాడు. ఈ విషయాన్ని బాధిత రైతుకు చేరవేశాడు. దీంతో అతను వచ్చి చూసేసరికి 20 గొర్రె పిల్లలు మృతి చెంది ఉన్నాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు బోరున విలపించాడు. ఈ విషయంలో ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

పశుగ్రాసం దగ్ధం



దగ్ధమవుతున్న పశుగ్రాసం వద్ద బాధిత రైతు

బొంరాస్‌పేట: మండలంలోని దీప్లానాయక్ తండాలో శనివారం రాత్రి పశుగ్రాసం దగ్ధమైంది. తండాకు చెందిన రైతు హీర్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తన వ్యవసాయ బోరు వద్ద దొడ్డిలోని వరి గడ్డివాము దగ్ధమైంది. అంతేకాకుండా రూ.5వేలు, ఒక ట్రాక్టరు కంది పొట్టు, వేరుశనగ పొట్టుతోపాటు బోరు మోటారు కేబుల్ కాలిబూడిదైందని ఆవేదన వ్యక్తపరిచాడు. రాత్రి పూట తండాకు చెందిన యువకులు బహిర్భూమికి వచ్చి చూసి చెప్పారన్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశాడు. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించలేదని రైతు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పనుల్లో జాప్యం | వాహనదారులకు శాపం



కొడంగల్- తాండూరు మధ్య గుంతలు తేలిన రహదారి



ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిన వృద్ధురాలు (ఫైల్)

- నత్తనడకన మహబూబ్‌నగర్- చించోలి జాతీయ రహదారి నిర్మాణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కొడంగల్: జాతీయ రహదారి నిర్మాణం పనులు నత్తను తలపిస్తూ వాహనదారులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. మహబూబ్‌నగర్- చించోలి జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం ఏర్పడుతోంది. ఆర్‌అండ్‌బీ అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనుల్లో పురోగతి కనిపించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. వికారాబాద్ జిల్లా పరిధిలోని దుద్యాల గేటు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు కొనసాగుతున్న పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. కొడంగల్ నుంచి తాండూరుకు 18 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ మార్గంలో ప్రయాణానికి గంటకు పైగా సమయం తీసుకుంటుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, బస్సులు కూడా తిరగలేని విధంగా రోడ్డు అధ్వానంగా మారింది. కల్వర్టుల కోసం తవ్వకాలు చేపట్టగా.. భారీగా గుంతలు ఏర్పడ్డాయి. వీటి గుండా ప్రయాణించి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం కాంట్రాక్టు పొందిన కంపెనీ పనుల్లో వేగం పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ రహదారి 167ఎన్

మహబూబ్‌నగర్-చించోలీ(ఎమ్‌సీ) అంతర్రాష్ట్ర రహదారిని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా మార్చింది. దీని నిర్మాణం కోసం కేంద్రం రూ.630 కోట్లు మంజూరు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. ఈ రహదారికి 167ఎన్ గా నామకరణం చేశారు. మహబూబ్‌నగర్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా చించోలి, మన్నాకెళ్లి వరకు రోడ్డు విస్తరణ చేయాల్సి ఉంది. నాలుగు లైన్ల రహదారి నిర్మిస్తున్నారు. బెంగళూరు- ముంబాయి జాతీయ రహదారులను కలిపే ఈ లింక్ హైవే 150 కిలోమీటర్ల పొడవు ఉంది. వికారాబాద్ జిల్లాలో 45 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంది. ఈ పనులను రెండు బిట్లుగా విభజించారు. మహబూబ్‌నగర్ నుంచి దుద్యాల గేటు వరకు ఒక బిట్టు, దుద్యాల గేటు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు మరో బిట్టుగా నిర్ణయించారు. మొదటి బిట్టులో పనులు చివరి దశకు చేరుకున్నాయి. రెండో దశ పనుల్లోనే జాప్యం జరుగుతోంది. ఆర్‌అండ్‌బీ అధికారుల అలసత్వం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కనిపిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో వేగం పెంచి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

ఎస్పీ నారాయణరెడ్డి



ఎస్పీకి గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

పరిగి: దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం పరిగి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంతో పోల్చితే పరిగిలో కేసుల సంఖ్య గణనీయంగా పెరిగాయన్నారు. వాటిని తగ్గించాలని సూచించారు. నేరాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంచాలన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధిత వర్గాలకు అండగా ఉండాలని సూచించారు. పెండింగ్ కేసులపై ఆరా తీసి త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ తక్షణమే స్పందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే చోట కారణాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణంలో శాంతి భద్రతలు పరిరక్షించాలని అధికారులకు సూచించారు. దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నాయని రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాలన్నారు. సైబర్ క్రైమ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ దాడులు

అనంతగిరి: అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి రవాణా చేస్తున్న వారిపై జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సీఐ ఆంజనేయులు, ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ ఆధ్వర్యంలో వికారాబాద్ పీఎస్ పరిధిలోని ధన్నారం గుట్ట నుంచి ఎర్రమట్టిని తరలిస్తున్న 5గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఎర్రమట్టి లోడ్ చేసిన 3 వాహనాలు, ఒక జేసీబీ, కారు, 4సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తాండూర్ పీఎస్ పరిధిలో ఒక ట్రాక్టర్, యాలాల్ పీఎస్ పరిధిలో రెండు ట్రాక్టర్లను ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకుని ముగ్గురు వ్యక్తులపై ఆయా పీఎస్ పరిధిలలో కేసులు నమోదు చేశారన్నారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం, ఇసుక, ఎర్రమట్టి మొరం అక్రమ రవాణా చేసినా, చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆంజనేయులు సెల్ నంబర్‌కి 8712670022 సమాచారం చేరవేయాలని ఎస్పీ తెలిపారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలిద్దాం



అవగాహన కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు

ఏహెచ్‌టీయూ అధికారి అలీమొద్దీన్

పరిగి: మానవ అక్రమ రవాణా అరికట్టాలని ఏహెచ్‌టీయూ అధికారి అలీమొద్దీన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మిట్టకోడూర్ ఉన్నత పాఠశాలలో ఏహెచ్‌టీయూ(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త వ్యక్తుల మాయమాటలకు ఎవరూ లొంగవద్దన్నారు. ప్రలోభాలకు ఎక్కువ శాతం విద్యార్థినులు, మహిళలు మోసపోతారన్నారు. ఉద్యోగులు ఇప్పిస్తామని, డబ్బులు ఆశ చూపి మోసం చేస్తారన్నారు. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరిగినా, చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్నా చట్టప్రకారం శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శరత్‌బాబు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధుసుదన్‌రావు, సాదిక్ అలీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

మహిళ కడుపులో 8 కిలోల కణతి

ఆపరేషన్ చేసి తొలగింపు



మహిళ కడుపులో నుంచి తొలగించిన కణతి

తాండూరు: ఓ మహిళ కడుపులో పెరిగిన 8 కిలోల కణతిని శనివారం ఆపరేషన్ ద్వారా తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కర్ణాటక రాష్ట్రం సేడం తాలూకా మదికల్ గ్రామానికి చెందిన లక్ష్మి కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను తాండూరులోని సాయితరుణ్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కడుపులో కణతి ఉందని గుర్తించిన వైద్యుడు జయప్రసాద్ ఆపరేషన్ చేసి తొలగించారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు



ర్యాలీలో విద్యార్థులు, డీఎస్పీ, ఎంవీఐ తదితరులు

పరిగి డీఎస్పీ శ్రీనివాస్

పరిగి: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణ కేంద్రంలోని పల్లవి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన వారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రతి ఒక్కరు వాహనాలను నడపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలతో ట్రాఫిక్ నిబంధనాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా తమ కుటుంబంలోని ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పరిగి ఎంవీఐ వీరేందర్‌నాయక్, ఎస్సై సంతోష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ తేజ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

అనంతగిరి: మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతిజ్ఞ్యరూ ప్రభుత్వానికి సహకరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాల్‌లో ఎక్సైజ్, విద్యాశాఖ, జిల్లా సంక్షేమ, వ్యవసాయ, పోలీస్ వివిధ శాఖల అధికారులతో మాదక ద్రవ్య నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, వసతి గృహాల్లో డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో మహిళా స్వయం సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు ఈ బాధ్యతను చేపట్టాలని కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, అడిషనల్ ఎస్పీ హనుమంత్ రావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి , డీఈఓ రేణుకాదేవి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఓ ప్రదీప్, డీవైఎస్ఓ హనుమంతరావు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్ నాయక్, అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతురి అదృశ్యం

పహాడీషరీఫ్: కూతురితో కలిసి ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ప్రీతి(19), సంతోష్ దంపతులు తుక్కుగూడ మంఖాల్‌కు వలస వచ్చి ప్లాస్టిక్ కంపెనీలో పని చేస్తున్నారు. వీరికి తొమ్మిది నెలల పాప సంతానం. ఈ నెల 13వ తేదీన తుక్కుగూడలోని మార్కెట్‌కు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వెళ్లి ప్రీతి, కూతురు కనిపించకుండా పోయారు. వారి ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకుండా పోయింది. ప్రీతి తల్లి నవరత్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

బెదిరించిన వారిపై చర్యలు తీసుకోండి



పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను చంపుతామని బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మంద కృష్ణమాదిగ అనేక పోరాటాలు చేపట్టారన్నారు. ఆయన్ని చంపుతామంటూ ప్రకటనలు చేస్తున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్, శ్రావణ్‌కుమార్, నాగభూషణ్, అంజయ్య, శేఖర్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల వికృత చేష్టలు

అరెస్టు చేసిన పోలీసులు

మీర్‌పేట: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్లను మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై రాత్రి వేళల్లో ట్రాన్స్‌జెండర్లు అసభ్యకర దుస్తులు ధరించడంతో పాటు వికృత చేష్టలు చేస్తూ రోడ్లపై వెళ్లే వారికి ఇబ్బందులు కలిగిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు శుక్రవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మందమల్లమ్మ చౌరస్తా, టీకేఆర్ కమాన్, గాయత్రినగర్ కూడళ్ల వద్ద 16 మంది ట్రాన్స్‌జెండర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. ఇకపై స్టేషన్ పరిధిలో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

షెడ్డు కూల్చివేతలో హైడ్రామా

తమ నిర్మాణాన్ని కూల్చేయొద్దంటూ పెట్రోల్ పోసుకొని హల్‌చల్

ఇబ్రహీంపట్నం: అక్రమ నిర్మాణమని ఓ షెడ్డును కూల్చి వేసేందుకు వచ్చిన మున్సిపల్ సిబ్బందిని సదరు యజమాని అడ్డుకొని ఒంటిపై పెట్రోల్ పోసుకొని హల్‌చల్ చేసిన ఘటన ఇబ్రహీంపట్నంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా పక్కన మంచాల రోడ్డుకు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ డి.రవి సోదరుడు సత్యనారాయణకు చెందిన స్థలంలో ఇటీవల రేకుల షెడ్ వేసి షెటర్లను నిర్మించారు. దీనికి అనుమతి లేదని ఇబ్రహీంపట్నం మున్సిపల్ సిబ్బంది జేసీబీతో కూల్చివేసేందుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రవి, సత్యనారాయణలు ఘటనాస్థలికి వచ్చి మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తన వద్ద అన్ని పత్రాలు, కోర్టు ఆర్డర్లు ఉన్నాయని రవి మున్సిపల్ సిబ్బందికి చెప్పే ప్రయత్నంలో ఆవేశానికి లోనయ్యారు. దీంతో రవి, అతని సోదరుడు సత్యనారాయణ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. స్థానికులు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మున్సిపల్ సిబ్బంది వెనుదిరిగారు.

అనుమతి లేదు: రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్

సత్యనారాయణ నిర్మించిన షెడ్‌తో కూడిన షెటర్లకు మున్సిపల్ అనుమతిలేదు. రాత్రిళ్లు నిర్మాణం చేపట్టారు. రోడ్లకి జరిగి నిర్మాణం చేపడుతున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. నిర్మాణదారులకు నోటీసులు కూడా ఇచ్చాం. కూల్చివేసేందుకు తమ సిబ్బంది వెళ్లడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడ్డారు.



కూల్చివేసేందుకు జేసీబీతో వచ్చిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ సిబ్బంది



పెట్రోల్ పోసుకుంటున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవి, పక్కన సత్యనారాయణ

రెక్కీ చేసి.. చోరీకి పాల్పడి

- దొంగతనం కేసులో నలుగురి అరెస్టు
- నగదు, వాహనాలు స్వాధీనం



పోలీసుల అదుపులో దొంగలు

మొయినాబాద్: రాత్రివేళలో గోదాం షటర్, తలుపులు, బీరువా తాళాలు పగులగొట్టి నగదు దోచుకెళ్లిన దొంగల ముఠాను మొయినాబాద్ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని భరద్వాజ్ కాలనీలో ఉన్న పద్మావతి అసోసియేట్ స్టోరేజ్ గోదాంలో ఈ నెల 15న రాత్రి చోరీ జరిగింది. రూ.6 లక్షల నగదు దొంగిలించడంతో మరుసటిరోజు గోదాం ఇన్‌చార్జి వినీత్‌రెడ్డి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించి ఎట్టకేలకు నలుగురిని పట్టుకున్నారు.

పది రోజుల ముందే పథకం

రాజస్థాన్‌కు చెందిన సైతాన్‌రామ్ మొయినాబాద్‌లో కిరాణ షాపు నిర్వహిస్తున్నాడు. తనకు అవసరమైన సరుకులను భరద్వాజ్ కాలనీలో ఉన్న స్టోరేజ్ గోదాం నుంచి తెచ్చుకునేవాడు. ఈ క్రమంలో గోదాంలో డబ్బులు ఎక్కడ పెడుతారనే విషయాలను గమనించాడు. పక్కన మెకానిక్ షాప్‌లో పనిచేసే పరమేశ్వర్‌తో కలిసి గోదాంలో దొంగతనం చేయాలని పది రోజుల ముందే పథకం పన్నారు. తమ ముఖాలను గుర్తిస్తారని భావించి దొంగతనం కోసం రాజస్థాన్‌కు చెందిన మరో ఇద్దరిని సిద్ధం చేశారు. కొంపల్లిలో ఉండే హులాస్, మొయినాబాద్‌లోని అయాన్ కళాశాల పక్కన ఉన్న ఫాంహౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే భవాని సింగ్‌ను పిలిపించారు. 15న అర్ధరాత్రి హులాస్, భవాని సింగ్‌లు టోపీలు, శాలువాలు ధరించి గడ్డపార, స్క్రూడ్రైవర్ సహాయంతో గోదాం షటర్ ఎత్తి, బీరువాను విరగొట్టి అందులో ఉన్న రూ.6 లక్షల నగదు దోచుకెళ్లారు. సైతాన్ రామ్, రామేశ్వర్‌లు ఫాంహౌస్ వద్ద బొలేరో వాహనంలో వేచి ఉన్నారు. దొంగతనం చేసిన డబ్బులు తీసుకురాగానే నలుగురు వాటాలు పంచుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. సీసీ కెమెరాల ఆధారంగా రెండు బృందాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం నలుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బొలేరో, యాక్టీవా, 4 సెల్ ఫోన్లు, రూ.2.96లక్షల నగదు, దొంగతనానికి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

గడువు ముగిసిన శీతల పానీయాల విక్రయం

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గడువు తీరిన శీతల పానీయాలు, సోడాను విక్రయిస్తున్న వ్యక్తిని మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన పరేష్ సేత్(46), మహదేవ్ పటేల్‌తో కలిసి గత కొన్నాళ్లుగా జల్‌పల్లి శ్రీరాం కాలనీలోని తుల్జా భవానీ వైన్స్ పక్కన కిరాణ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇందులో గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్, సోడాను విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించి, పానీయాలను శనివారం స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు.

వైభవంగా బోనాల ఊరేగింపు



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

మర్పల్లి: మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామంలో శనివారం ఎల్లమ్మ, దుర్గమాతల బోనాల ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచే గ్రామస్తులు తమ ఇళ్లలో ఇత్తడి బిందెలకు పసుపు, కుంకుమ బొట్లతో అలంకరించారు. అనంతరం ప్రధాన వీధుల గుండా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బోనాలతో వెళ్తున్న మహిళలు